

30 వరకు 'పది' పరీక్ష ఫీజు గడువు : డీఈవో

కరీంనగర్ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అక్టోబరు 30లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్, ఫెయిల్ అయిన విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యేందుకు నిర్ణీత గడువులోగా ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రూ.50 ఆలస్య రుసుముతో నవంబరు 15 వరకు, 200 రూపాయల రుసుముతో డిసెంబరు 2 వరకు, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబరు 15వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని తెలిపారు.

కోతల సమయంలో వర్షం

- నేలకొరిగిన వరి పంట
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం



గోపాల్‌పూర్‌లో వర్షంతో నేలకొరిగిన వరి

కరీంనగర్ రూరల్‌, అక్టో బర్ 24 (ఆంధ్రజ్యోతి): వరి కోతల సమయంలో వర్షాలు పడుతుండటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేతికి వ చ్చిన పంట నష్టపోతా మని ఆందోళన చెందుతు న్నారు. శుక్రవారం మధ్యా హ్నం కురిసిన వర్షంతో కరీంనగర్ రూరల్ మండలంలోని ఆయా గ్రామాల్లో వరి పంట నేలకొరిగింది. కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం తడిచింది. ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తుపాను ప్రభావంతో మరో రెండు రోజుల పాటు వర్షం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షంతో గోపాల్‌పూర్, చేగుర్తి, ఇరుకుల్ల, చామనపల్లి, చెర్లబూత్కూర్, నగునూర్ గ్రామాల్లోని వరి పంట నేలవాలింది. కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చి ఆరబోసిన ధాన్యం తడి చింది. అన్ని గ్రామాల్లో కొను గోలు కేంద్రాలు ప్రారం భించాలని రైతులు కోరుతున్నారు.



కొనుగోలు కేంద్రంలో ధాన్యంపై టార్పాలిన్ కప్పిన రైతులు

గన్నేరువరం మానేరు వంతెనకు నిధులు



- సీఆర్ఐఎఫ్ విడుదల చేస్తూ కేంద్రం ఉత్తర్వులు
- మానేరు వంతెనకు రూ.77 కోట్లు
- ఆర్నకొండ-మల్యాల క్రాస్ రోడ్డు విస్తరణకు రూ.50 కోట్లు
- వంతెన నిర్మాణం ఎక్కడనేది ప్రశ్నార్థకం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

మానేరు నదిపై వంతెన నిర్మించి జిల్లా కేంద్రమైన కరీంనగర్‌తో దూరభారం తగ్గించాలని కోరుతున్న గన్నేరువరం మండల వాసుల కల ఫలిస్తున్నది. ఇప్పటికే మంజూరైన ఈ వంతెనకు ప్రస్తుతం కేంద్రం నిధులు కూడా విడుదల చేసింది. సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్) నుంచి వంతెనకు 77 కోట్ల రూపాయలు విడుదలయ్యాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సీఆర్ఐఎఫ్ నుంచి 162 కోట్లతో మూడు పనులు మంజూరయ్యాయి. గతంలోనే పనులు మంజూరు కాగా ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కరీంనగర్ నుంచి గన్నేరువరం మండల కేంద్రానికి రాకపోకలను దూరభారం తగ్గించి ప్రజలకు చేరువ చేసేందుకు మానేరు నదిపై వంతెన నిర్మించడమే మార్గమని భావించారు. ప్రస్తుతం కరీంనగర్ నుంచి గన్నేరువరం రాజీవ్ రహదారి గుండ్లపల్లి మీదుగా కానీ రాజన్న సిరిసిల్ల జిల్లా వెంకట్రావుపల్లె మీదుగా గానీ వెళ్లాల్సి వస్తుంది. గుండ్లపల్లి నుంచి వెళితే 40 కి.మీ., వెంకట్రావుపల్లి నుంచి వెళితే 34 కి.మీ ప్రయాణించాల్సి వస్తున్నది. మానేరుపై వంతెన నిర్మిస్తే 20 కి.మీ.లోగానే కరీంనగర్‌కు చేరుకునే అవకాశం కలుగుతుంది. దీనితో కరీంనగర్ ఎంపీ, కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ మానేరు నదిపై వంతెన నిర్మించాలని కేంద్రానికి ప్రతిపాదించగా సీఆర్ఐఎఫ్ నుంచి ఆ మేరకు మంజూరు చేశారు. ఇప్పుడు 77 కోట్ల రూపాయలు కూడా విడుదల చేశారు. దీనితో పాటు చొప్పదండి మండలం ఆర్నకొండ నుంచి జగిత్యాల జిల్లాకు చెందిన మల్యాల క్రాస్ రోడ్ వరకు 35 కి.మీ. నిడివి గల రోడ్లు, భవనాల శాఖ రహదారిని రెండు వరుసల రోడ్డుగా మార్చేందుకు 50 కోట్ల రూపాయలు విడుదలయ్యాయి. అలాగే రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ నుంచి సిరికొండ వరకు 23 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు కూడా నిధులు విడుదల చేశారు. త్వరలోనే ఈ పనులను చేపట్టేందుకు రోడ్లు, భవనాల శాఖ సన్నాహాలు చేస్తున్నది. నిధులు విడుదల కావడంతో వెంటనే టెండర్లు పిలిచి కాంట్రాక్టును ఖరారు చేసి వీలైనంత తొందరలో పనులు ప్రారంభించాలని ఆ శాఖ భావిస్తున్నది.

మానేరు వంతెన నిర్మించేదెక్కడ ?

గన్నేరువరం మండల కేంద్రానికి ప్రయాణ దూరం తగ్గించేందుకు నిర్మించతలపెట్టిన మానేరు వంతెనను ఎక్కడ చేపట్టాల న్నది వివాదంగా మారింది. ఎంపీ, కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ ముందుగా ప్రతిపాదించిన మేరకు కొత్తపల్లి మండలం ఖాజీపూర్, చొక్కారావుపల్లి గ్రామాలను కలుపుతూ మానేరు నదిపై 500 మీ. పొడవున వంతెన నిర్మించాల్సి ఉంటుంది. ఈ వంతెన నిర్మాణమైతే గన్నేరువరం మండల కేంద్రం నుంచి చొక్కారావుపల్లి మీదుగా కరీంనగర్, పద్మనగర్ వరకు 15 కి.మీ. ప్రయాణించి చేరుకునే అవకాశం ఉంటుంది. అయితే మండలవాసుల నుంచి మరో రెండు ప్రతిపాదనలు కూడా వచ్చాయి. ఆ ప్రతి పాదనల మేరకే వంతెన చేపట్టాలని కోరుతూ ఆయా గ్రామాల ప్రజలు వినతిపత్రాలు ఇవ్వడమే కాకుండా ఆందోళ

(మిగతా 8వ పేజీలో)

సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలకు చేయూత

- ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కమిషనర్ అంకిత పాండే



వర్క్‌షాపులో మాట్లాడుతున్న ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కమిషనర్ అంకిత పాండే

కరీంనగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 2047 నాటికి దేశం అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న సంకల్పంతో ముందుకెళ్తున్న ప్రభుత్వం సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలకు చేయూతనందిస్తోందని సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ కమిషనర్ అంకిత పాండే అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమావేశమందిరంలో సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల డెవలప్‌మెంట్ కమిష నర్ ఆధ్వర్యంలో క్లస్టర్ స్థాయి వర్క్‌షాపు నిర్వహించారు. ఈ వర్క్‌షాపులో ఎంఎస్ఎంఈ, సెబీ, ఇండస్ట్రీ జీఎస్టీ, బ్యాంకింగ్ తదితర రంగాలకు చెందిన పలువురు అధికారులు మాట్లాడారు. వ్యవసాయ రంగం తర్వాత ఎక్కువ ఉపాధి ఉత్పత్తి ఇచ్చే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక మార్పులు, సంస్కరణలను తీసుకొచ్చిందని అన్నారు. వివిధ సంస్థల పరిశ్రమల ప్రతినిధులు ఎంఎస్ఎంఈలు ఎదుర్కొంటున్న సమస్యలను, పరిష్కార మార్గాలను, సలహాలు, సూచనలను అందించారు. ఎంఎస్ఎంఈలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపుతామని హామీ ఇచ్చారు. అనంతరం ఎంఎస్ఎంఈల ఆవశ్యకత, అభివృద్ధి, వస్తువు ధరలు ఎలా తగ్గించి నాణ్యతగా ఎలా అందించాలనే అంశాలపై సంస్థలు, చిన్న పరిశ్రమల ప్రతినిధులకు ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ వర్క్‌షాపులో స్టేట్ జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ సిహెచ్.రవికుమార్, సెబీ డిప్యూటీ మేనేజర్ వివిఆర్ ప్రసాద్, ఇండస్ట్రీ జెడి మధుకర్, ఎంఎస్ఎంఈ జెడి సిఎస్ఎస్ రావు, కెవిఐబి సీఈవో వెంకటేశ్వర్, ఎల్‌డిఎం అంజనేయులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలి

- మత్తు పదార్థాలతో మానసికంగా, శారీరకంగా తీవ్ర నష్టం
- పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం



ర్యాలీలో పాల్గొన్న సీపీ గౌస్ ఆలం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, విద్యార్థులు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అన్నారు. 'నషాముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్‌లో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల, పాఠశాల విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ ర్యాలీ కలెక్టరేట్ నుంచి తెలంగాణ చౌక్ మీదుగా పోలీస్ పరేడ్ గ్రౌండ్ వరకు కొనసాగింది. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఈ ర్యాలీలో పాల్గొని డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పోలీస్ కమిషనరేట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ గౌష్ ఆలం మాట్లాడారు. వివిధ రకాల ఒత్తిళ్ల కారణంగా చాలా మంది డ్రగ్స్‌కు బానిసలవుతున్నారని, మత్తు పదార్థం మానసికంగా, శారీరకంగా తీవ్ర నష్టం చేస్తుందని అన్నారు. ఒత్తిళ్లను అధిగమించేం దుకు స్నేహితులతో మాట్లాడడం, పుస్తకాలు చదవడం, సామాజిక సేవ వంటి అనేక మార్గాలు ఉన్నాయని సూచించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజం కోసం స్వచ్ఛంద సంస్థలు, అధికారులు చేస్తున్న కృషి అభినందనీయ మన్నారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యా ర్థులు మత్తు పదార్థాల నివారణపై చేసిన నృత్యరూపకం ఆకట్టుకుంది. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీమ్ రావ్, డీఐటీ గంగాధర్, సీడీపీఓ సబిత, ఎస్ఎంటీఏ కమిటీ సభ్యులు పెండ్యాల కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలల సేవలను వినియోగించుకోవాలి

- జిల్లా వైద్యాధికారి వెంకటరమణ

గంగాధర, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలల సేవలను ప్రజలు వినియోగించు కోవాలని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ అన్నారు. శుక్రవారం గంగాధర పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు రిజిస్టర్, అవుట్ పేషెంట్ రిజిస్టర్ ఇతర రికార్డులను పరిశీలించారు. వ్యాధిగ్రస్తుల వివరాలను పరిశీలించారు. అవుట్ పేషంట్లతో మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో బీపీ, షుగర్ వ్యాధులకు ఉచితంగా మందులు అందిస్తున్నట్లు తెలిపారు. ఫార్మసీ స్టోర్లలో సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందుల నిల్వలను పరిశీలించారు. పిల్లల వ్యాధి నిరోధక టీకాలు నిల్వ ఉంచే ఐఎల్ఆర్‌ను దాని రోజువారి టెంపరేచర్ రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపులలో మహిళల స్క్రీనింగ్ పూర్తి చేయాలన్నారు. ప్రసూతి గదిని పరిశీలించి అందులో ఉండాల్సిన అత్యవసర మందులను పరిశీలించారు. సాధారణ ప్రసవాలు జరిగేటట్లుగా ప్రోత్సహిం చాలన్నారు. ఆయన వెంట పీవో డాక్టర్ సనజవేరియా, వైద్యాధికారి శ్వేత సిబ్బంది పాల్గొన్నారు.



మందులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో 59 నామినేషన్లకు ఆమోదం

- నేడు ఉపసంహరణ, తుది జాబితా, గుర్తుల కేటాయింపు

7

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

- యాసంగి సన్నవడ్లకు బోనస్ రాలేదని అడిషనల్ కలెక్టర్‌ను ప్రశ్నించిన రైతులు

సైదాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని విశాల పరపతి సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్ శుక్రవారం ప్రారంభించారు. రాయికల్, బొమ్మకల్ గ్రామాల్లో ప్రభుత్వం ఇస్తానన్న రూ. 500 యాసంగి సన్నవడ్ల బోనస్ ఇప్పటి వరకు ఇవ్వలేదని అడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్‌ను రైతులు నిలదీశారు. ఆరుగాలం కష్టపడి ఆశతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం విక్రయిస్తే రైతులను మోసం చేశారని అన్నారు. వెంటనే బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో లక్ష్మి కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వం యాసంగి బోనస్‌తో పాటు ఈ వానాకాలం సన్నవడ్ల బోనస్ చెల్లిస్తుందని తెలిపారు.

అనంతరం దుద్దెనపల్లి, రాయికల్, బొమ్మకల్, ఘణపూర్, పెర్కపల్లి, సర్వాయిపేట, వెంకటేశ్వర్లపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిం చారు. కార్యక్రమంలో చైర్మన్ కొత్త తిరుపతి రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, ఆర్ఐవో రమేష్‌బాబు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో యాదగిరి, ఏవో వైదేహి, మార్కెట్ వైస్‌చైర్మన్‌రాజ్‌కుమార్, డైరెక్టర్లు పాల్గొన్నారు.



రాయికల్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్

జైలును ఒక పరివర్తన కేంద్రంగా భావించాలి

- న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె వెంకటేశ్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి): విచారణ ఖైదీలు జిల్లా జైలును ఒక పరివర్తన కేంద్రంగా భావించాలని న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి, సీని యర్ సివిల్ జడ్జి కె వెంకటేశ్ అన్నారు. కరీంనగర్ జిల్లా జైలులో ఖైదీలకు భోజన వసతితో పాటు ఇతర మౌలిక వసతులను శుక్ర వారం కరీంనగర్ జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి, సీని యర్ సివిల్ జడ్జి కె వెంకటేశ్ పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి భోజనం, యోగక్షేమాలు, న్యాయ సేవలు, ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైలులో గడిపిన కాలంలో సత్ప్రవర్తనతో మెలిగి బయటకు వెళ్లిన తరువాత క్షణికావేశానికి లోనుకాకుండా ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గంజాయి సేవించినా, విక్రయిం చినా. గంజాయి కలిగి ఉన్నా కఠినమైన శిక్షలున్నాయని పేర్కొన్నారు. కొత్తగా వచ్చిన చట్టాలపై ఖైదీలకు అవగాహన కల్పించారు. అనంతరం జైలులోని క్యాంటిన్, ఆసుపత్రి, ములాఖత్ గది, లైబ్రరీ, వంటశాల, జైలు లోని ఇండస్ట్రీలను పరిశీలించి, పనితీరు బాగుందని అభినందించారు. మహిళా జైలును సందర్శించి మహిళా ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జైలు సూపరింటెండెంట్ పి శ్రీనివాస్, డిప్యూటీ జైలర్ ఎల్ రమేష్, కరీంనగర్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ లాయర్ తనుకు మహేష్, జైలు గార్డింగ్ సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.



జైలును సందర్శించిన జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి కె వెంకటేశ్

ధర లేక పత్తి రైతు దిగాలు

- క్వింటాల్‌కు రూ. 6వేల నుంచి రూ. 6,500
- తేమ పేరుతో తగ్గిస్తున్న వ్యాపారులు

హుజూరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు ధరలు లేక దిగాలు పడుతున్నారు. తేమ పేరుతో వ్యాపారులు సిండిగేట్‌గా మారి క్వింటాల్ పత్తికి రూ. 6వేల నుంచి రూ. 6,500వరకు ధర చెల్లిస్తూ రైతుల నడ్డివిరుస్తున్నారు. మొదట్లో పత్తి రైతులు విత్తనాలు విత్తగా, వర్షాలు లేక భూమిలోనే పొట్టిపోయాయి. మళ్లీ దు క్కులు దున్ని, అచ్చులు తోలి విత్తనాలు నాటారు. తీరా పూత దశలో భారీ వర్షాలు కురిశాయి. దీంతో పత్తి పూత నేలరాలి పోయింది. ఉన్న పత్తికి తెల్ల, పచ్చదోమ అధికమవడంతో మందులు పిచికారి చేశారు. డివిజన్‌లో హుజూరాబాద్, జమ్మి కుంట, ఇల్లందకుంట, వీణవంక, సైదా పూర్, శంకరపట్నం మండలాలు ఉండగా, 1.20లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం ఉంది. ఇందులో 80వేల ఎకరాల్లో వరి, 25వేల ఎకరాల్లో పత్తి, 15వేల ఎకరాల్లో మొక్క జొన్న, కూరగాయలు ఇతర పంటలను సాగు చేశారు. తీరా పత్తి చేతికందే సమయంలో కూలీల కొరత ఏర్పడింది. గత వారం రోజులుగా అల్పపీడన ప్రభావం తో రైతులు భయపడి ఒక్కో కూలీకి రూ. 300నుంచి రూ. 400 చెల్లించి ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి పత్తి తీయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర పత్తికి క్వింటాల్‌కు రూ. 8,110, మధ్య రకానికి రూ. 7,710 ఉండగా దళారులు తక్కువ ధర చెల్లించి రైతులను నట్టేట ముంచుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పత్తికి మద్దతు ధర వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



హుజూరాబాద్ మండలం కాట్రపల్లిలోని పత్తిచేను



ధర లేకపోవడంతో ఇంట్లో నిల్వ చేసుకున్న పత్తి

రోడ్డు ప్రమాదంలో కూలీ దుర్మరణం


శ్రీనివాస్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని సత్తెపీరీల దర్గా సమీపంలోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై మూల మలుపు వద్ద గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామానికి చెందిన కూలీ శివ రాత్రి శ్రీనివాస్(34) దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామంలోని శివ రాత్రి శ్రీనివాస్ దినసరి కూలీ పనులు చేస్తుండేవాడు. స్వగ్రామం నుంచి పని నిమిత్తం తన ద్విచక్రవాహనంపై రాచర్లగొల్లపల్లి వైపు వస్తున్న క్రమంలో సత్తెపీరీల దర్గా మూలమలుపు వద్ద ముందు వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీని ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయాలపాలైన అతన్ని 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే శ్రీనివాస్ చనిపోయాడని నిర్ధారించారు. మృతుడికి తల్లి నర్సవ్వ, ఇద్దరు కొడుకులు శ్రీకాంత్, అరవింద్ ఉన్నారు. మృతుడి సోదరుడు నర్సయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య


బుగ్గయ్య(ఫైల్)

ముస్తాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలో అనారోగ్యంతో మనస్తాపం చెంది ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై సీహెచ్ గణేశ్ శుక్రవారం తెలిపారు. గ్రామానికిచెందిన మానుక బుగ్గయ్య(70) కొంతకాలంగా అనారోగ్య కారణలతో బాధపడుతున్నాడు. ఈనేపథ్యంలో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొడుకు ఉప్పలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో పాము కాటుతో ఇద్దరు మృతి


శంకర్(ఫైల్)

తిమ్మాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో నిద్రిస్తున్న వ్యక్తిని పాము కాటు వేయడంతో ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గ మధ్యలో మృతిచెందిన సంఘటన మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరానగర్ గ్రామానికి చెందిన దమ్మని శంకరయ్య(39) స్థానిక ప్రియామిల్క్‌లో ఉద్యోగం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం సాయంత్రం రాత్రి ఇంటికి వచ్చి నిద్రపోయిన శంకర్‌ను నాగు పాము కాటువేసింది. కుటుంబసభ్యులు వెంటనే 108లో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. శంకర్‌కు ఏం కరిచిందో ఇంట్లో వేతికితే నాగుపాము కనిపించింది. దాన్ని స్థానికులు చంపేశారు. మృతుడు శంకర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అప్పటి వరకు అందరితో కలిసి మెలిసి ఉన్న శంకర్ మృతిచెందడంతో గ్రామంలో విషాద చాయాలు నెలకొన్నాయి.

రూపునారాయణపేటలో డిగ్రీ విద్యార్థిని..


అక్షిత(ఫైల్)

ఓదెల: ఓదెల మండలంలోని రూపునారాయణపేటకు చెందిన అక్షిత(18) అనే డిగ్రీ విద్యార్థి శుక్రవారం ఉదయం పాముకాటుకు గురై మృతి చెందింది. సుల్తానాబాద్ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న అక్షిత బతుకమ్మ పండుగకు ఇంటికి వచ్చింది. శుక్రవారం ఉదయం కాలుపై పాము కాటువేయడంతో గ్రామస్థుడి సలహాతో పాము కాటుకు మంత్రం వేయించేందుకు మరో గ్రామానికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో అక్షిత ఆరోగ్య పరిస్థితి విషమించింది. దీంతో 108అంబులెన్స్‌లో సుల్తానాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి పోలీసులు తెలిపారు.

దారులు అధ్వానం.. రాకపోకలకు నరకం

- ఏళ్ల తరబడి వాహనదారుల అవస్థలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

జగిత్యాలరూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలంలో అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యా యి. దెబ్బతిని ఏళ్ల గడుస్తున్నా, తారు లేచిపోతున్నా నూతన రోడ్ల నిర్మాణాలు చేపట్టకపోగా కనీసం మరమ్మతులకు నోచుకోవడంలేదు. గుంతల రహదారులపై ఇబ్బం దుల మధ్య నిత్యం వేల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతోపాటు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రహదారుల మరమ్మతు, నిర్వహణ నుపట్టించుకోలేదని ప్రయాణికులు, ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


తారులేచి అధ్వానంగా మారిన వెల్దుర్తి రహదారి

దెబ్బతిన్న రహదారులు...

జగిత్యాల జిల్లా కేంద్రానికి అతిసమీపంలో ఉన్న తిమ్మాపూర్-పొలాసకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. పది సంవత్సరాల కిందట నిర్మించిన ఈ రహదారి గోతులు, మట్టి నీటితో నిండిపోయి వాహనదారులకు నరకయాతనగా మారింది. వర్షం పడితే చెరువులా మారుతోంది. కాకతీయ కెనాల్ నీరు నిత్యం రోడ్డుపైనే ప్రవహిస్తోంది. పలుచోట్ల తారులేచిపోయి లోతైన గుంతలు ఏర్పడ్డాయి. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందనలేకపోవడంతో గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల మండలం మోతె, జగిత్యాల రూరల్ మండలంలోని వెల్దుర్తి, నర్సింగాపూర్, వంజరిపల్లె, హన్మాజీపేట, తిప్పన్నపేట మీదుగా బాలపల్లికి వెళ్లే అంతర్గత రోడ్లు తారులేచి పోయి అధ్వానంగా మారాయి. గోతులు ఏర్పడడంతో ప్రయాణికులు, రైతులు, విద్యార్థులు, రోడ్లపై ప్రయాణం చేయాలంటేనే నరకయాతన అనుభవిస్తున్నారు. రైతులు వేకువ జామున జగిత్యాలలోని మార్కెట్‌కు వెళ్లే క్రమంలో రోడ్లపై గోతులు కనబడకపోవడంతో ప్రమాదాలకు బారిన పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికా రులు స్పందించి అంతర్గత రోడ్లను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులకు నోచుకోని రహదారులు

మల్యాల: మండలంలో అనేక గ్రామాల్లో గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోని ఈ రహదారులు ఇటీవల ఈ వానాకాలంలో వర్షాలకు మండలంలోని దాదాపుగా అన్ని గ్రామాల్లో కోతలకు గురి కాగా కొన్ని చోట్ల వర్షపు నీటికి కొట్టుకుపోయాయి. రామన్నపేట నుంచి గొర్రెగుండం వెళ్లేదారి తారులేచి రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. రాంపూర్ నుంచి జగిత్యాల వెళ్లే రహదారికిరువైపులా లోతైన గోతులు ఏర్పడ్డాయి. అలాగే రాంపూర్ నుంచి రామన్నపేటకు వచ్చే మార్గం పనులు నిలిచి కంకర తేలింది. రహదారులు మరమ్మతులకు నోచుకోకపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మల్యాల నుంచి సర్వాపూర్, బల్వంతాపూర్, గుడిపేట వెళ్లేదారులు అధ్వనంగా మారడంతో ప్రజలు ప్రయాణానికి పాట్లు పడాల్సి వస్తోంది. మండలంలో సగానికి పైగా గ్రామాల్లోని రహదారుల పరిస్థితి ఇలాగే ఉండగా ప్రజాప్రతినిధులు, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.


అధ్వానంగా గొర్రెగుండం వెళ్లే దారి

ప్రమాదాల బారినపడుతున్నారు..

- కొడిపల్లి నాగార్జున్, తిమ్మాపూర్



నిత్యం రద్దీగా ఉండే గ్రామాల అంతర్గత రోడ్లు దెబ్బతినడంతో ప్రయాణికులు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు ప్రమాదాలబారిన పడుతున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, గ్రామాల ప్రజలు రోడ్లపై ప్రయాణించడానికి నరకయాతన పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారుల నిర్మాణాలు చేపట్టాలి.

తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీ..

సైదాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దెనపల్లి గ్రామంలో తాళంవేసి ఉన్న ఇళ్లలో దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. దుద్దెనపల్లి గ్రామంలో బొరగల్ల నర్సవ్వ, బొరగల్ల రాజయ్య, బొల్లి నరేష్ అనేవ్యక్తులు తమ ఇళ్లకు తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లగా గురువారం రాత్రి తాళాలు పగలగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఇండ్లలోని విలువైన వస్తువులు చోరీకి గురైనట్లు వారు తెలిపారు. ఈ విషయంపై పోలీసులను వివరాలు కోరగా, పూర్తి వివరాలు తెలియరాలేదన్నారు.

బంగారు చైన్ అపహరణ

ధర్మపురి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని గోదావరి నది వద్ద భాగ్య అనే మహిళ పర్స్‌లో నుంచి అర తులం బంగారు చైన్ అపహరించిన సంఘటన శుక్రవారం జరిగింది. దీంతో ఆమె చుట్టు పక్కనే ఉన్న భక్తుల సహాయంతో చైన్ అపహరించిన మహిళను పట్టుకుని పోలీసులకు అప్పగించింది. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేటకు చెందిన భాగ్య అనే మహిళ కుటుంబసభ్యులతో కలిసి గోదావరి నది స్నానం కోసం వచ్చింది. స్నానం చేసే సమయంలో స్నానఘట్టాల వద్ద బ్యాగులు, పర్స్ ఉంచి నదిలోకి వెళ్లింది. ఆ సమయంలో భిక్షాటన చేస్తున్న ఒక మహిళ అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించింది. సదరు మహిళనే పర్స్‌లో నుంచి బంగారు చైన్ అపహరించిందని పోలీసులకు అప్పగించింది. బాధితురాలు భాగ్య బంగారు చైన్ చోరీ గురించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బంగారు చైన్ చోరీ గురించి పోలీసులు విచారణ చేస్తున్నారు.

హత్యానేరంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి జీవితఖైదు

- ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల జరిమానా
- కరీంనగర్ ప్రత్యేక ఫ్యామిలీ కోర్టు తీర్పు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తమ కూతురు ప్రేమించి కులాంతర వివాహం చేసుకుందనే కక్ష పెంచుకున్న ఆమె కుటుంబసభ్యులు చివరకు ఆమె భర్త ఆవునూరు శ్రీనివాస్(31)ని రాళ్లతో కొట్టి హత్యచేశారు. ఈకేసులో నిందితులు నలుగురికి జీవిత ఖైదుతోపాటు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రత్యేక ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి జే కవిత శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.... కరీంనగర్ జిల్లా వీణవంక మండలం బ్రాహ్మణపల్లికి చెందిన మండల గౌతమి అదే గ్రామానికి చెందిన ఆవునూరి శ్రీనివాస్‌లు ప్రేమించుకున్నారు.

కొంతకాలం వేరే గ్రామంలో నివాసం ఉండి తిరిగి బ్రాహ్మణపల్లికి వచ్చి అక్కడే నివాసం ఉన్నారు. వారికి ఇద్దరు సంతానం కలిగారు. గౌతమి ఇతర కులానికి చెందిన శ్రీనివాస్‌ను వివాహం చేసుకోవటం తండ్రి మండల ఓదెలుకు ఇష్టం లేదు. దీంతో శ్రీనివాస్‌పై కక్ష పెంచుకున్న గౌతమి తండ్రి ఓదెలు(48), సోదరులు మండల సంపత్(28), మండల దేవేందర్(25), తల్లి మండల లక్ష్మి(45)లు గతంలో ఒకసారి దాడి చేయగా గౌతమి తండ్రి, సోదరుడిపై కేసులు నమోద య్యాయి. 2019జూన్ 19న రాత్రి ఆవునూరి శ్రీనివాస్ మద్యం సేవించి తన బైక్‌పై ఇంటికి వస్తూ మార్గ మధ్యలో గౌతమి తండ్రి ఇంటివద్ద బైక్ నిలిపి ఫోన్‌లో గౌతమితో మాట్లాడుతుండగా గౌతమి కుటుంబసభ్యులు నలుగురు శ్రీనివాస్‌పై రాళ్లతో దాడి చేశారు. ఈ రాళ్లదాడిలో శ్రీనివాస్ తలకు తీవ్రగాయాలు కాగా వెంటనే ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శ్రీనివాస్ మృతి చెందాడు.

ఈ ఘటనపై వీణవంక పోలీసులు గౌతమి కుటుంబ సభ్యులు నలుగురిపై కేసు నమోదు చేయగా జమ్మికుంట రూరల్ సీఐ ఏ రాములు దర్యాప్తు జరిపారు. ఈ కేసులో సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జూలూరు శ్రీరాములు కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. సాక్షాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి గౌతమి తండ్రి ఓదెలు, సోదరులు సంపత్, దేవేందర్, తల్లి లక్ష్మిలకు జీవితఖైదుతోపాటు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

సైదాపూర్‌లో ఎలుగుబంటి సంచారం

- ఆందోళన చెందుతున్న ప్రజలు

సైదాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని సమ్మక్కగుట్ట వద్ద పెట్రోల్‌బంక్ ముందు నుంచి గురువారం రాత్రి ఎలుగుబంటి సంచరిస్తూ రోడ్డుపైవెళ్తున్న దృశ్యాలు పెట్రోల్ బంక్ సీసీకెమెరాలో రికార్డు అయ్యాయి. ఆ దృశ్యాలు బయటకి రావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రైతులు రాత్రి బావుల కాడికి కరెంటు పెట్టేందుకు వెళ్తారని, ఎలుగుబంటి సంచారంతో ఇబ్బందులు ఉంటాయని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖాధికారులు ఎలుగుబంటిని బంధించి తీసుకుపోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.


సమ్మక్క గుట్ట వద్ద సంచరిస్తున్న ఎలుగుబంటి

మహిళలకు బ్యూటీషియన్ కమర్షియల్ కోర్సుల శిక్షణ

తిమ్మాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్ఎండీకాలనీలోగల దుర్గాబాయి మహిళాశిశువికాస కేంద్రంలో జిల్లా మహిళానైపుణ్యాభివృద్ధి శిక్షణాసంస్థ కమర్షియల్ పద్ధతిలో 45రోజుల పాటు 15నుంచి 50సంవత్సరాలలోపు మహిళలకు వారి అనుకూల సమయాల్లో బ్యూటీషియన్‌కోర్సుపై శిక్షణను అందించనున్నట్లు కేంద్రం జిల్లామేనేజరు సుధారాణి శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. బ్యూటీషియన్‌లో వివిధరకాల కోర్సులనుబట్టి ఫీజు ఉంటుందని, ఆసక్తి గల మహిళలు ఆధార్‌జిరాక్స్, రెండు ఫొటోలతో నవంబర్13లోపు ఎల్ఎండీకాలనీలోని తమకార్యాలయంలో దరఖాస్తుచేసుకోవాలని తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- తొమ్మిది మందిపై కేసు
- రూ 33,200 నగదు స్వాధీనం

ధర్మపురి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో ఒక గొర్రెల ఫామ్‌లో పేకాట ఆడుతున్న తొమ్మిదిమంది వ్యక్తులను శుక్రవారం సాయంత్రం పోలీసులు అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.33,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. కొంతకాలం నుంచి గ్రామంలో పేకాట ఆడుతున్నారనే అందిన పక్కా సమాచారం మేరకు ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది దాడిచేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశారు. జూదం ఆడితే కేసులు నమోదుచేసి చట్టరిత్యా కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఉదయ్‌కుమార్ హెచ్చరించారు.

మంథనిలోని గంగాపురి శివారులో..

మంథని, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని గంగాపురి శివారులో పేకాట శిబిరంపై శుక్రవారం దాడిచేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. కొందరు మూడు పత్తాలు ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేయగా గంగాపురి గ్రామానికి చెందిన మేడిశెట్టి సతీష్, ఓగ్గం అజయ్, దూడపాక రాజశేఖర్, ఎరుకల శేఖర్‌లను పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.8150నగదు, 4సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

కరీంనగర్ క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న దాడి ప్రణీత్‌కుమార్ తన సెల్‌ఫోన్‌ను తీగలగుట్టపల్లిలో పోగొట్టుకోగా కరీంనగర్‌రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్ పెద్దపల్లిలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి శుక్రవారం ప్రణీత్‌కుమార్‌ను పోలీస్‌స్టేషన్ పిలిపించి సెల్‌ఫోన్‌ను అప్పగించారు. సెల్‌ఫోన్ రికవరీలో కీలకంగా పనిచేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

విద్యార్థిని మృతదేహంతో ఎమ్మెల్యే ధర్నా, రాస్తారోకో

హుజూరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద వంగర గురుకుల పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థిని శ్రీవర్ష(15) మృతదేహంతో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి శుక్రవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలోని పీవీ రంగారావు గురుకుల పాఠ శాలలో హుజూరాబాద్ మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన విద్యార్థిని వి శ్రీవర్ష ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దీపావళి పండుగ సందర్భంగా శ్రీవర్ష రాంపూర్ గ్రామానికి రాగా, గురువారం కుటుంబ సభ్యులు శ్రీవర్షను హాస్టల్‌లో వదిలి వచ్చారు. ఈ క్రమంలో హాస్టల్‌లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. శ్రీవర్ష మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వంగర ఎస్ఐ దివ్య హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఏరియా ఆస్పత్రికి చేరుకొని విద్యార్థిని కుటుంబ సభ్యులను ఓదార్చి, వారితో మాట్లాడారు. అనంతరం విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని మృతదేహాన్ని మోసుకుంటూ అంబేద్కర్ చౌరస్తా వద్దకు తీసుకువచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ముందస్తుగా పోలీసులు భారీబందోబస్తు ఏర్పాటు చేశారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థిని కుటుంబ సభ్యులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. దీంతో వరంగల్-కరీంనగర్ జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్‌తో ఫోన్‌లో మాట్లాడారు. బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ విద్యార్థిని మృతి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.


విద్యార్థిని శ్రీవర్ష మృతదేహంతో ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, నాయకులు

కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలి..

- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

శ్రీవర్ష కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.కోటి పరిహారం ఇవ్వాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. విద్యార్థిని మృతికి కారకులైనా వంగర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. విద్యార్థి మృతిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, కారకులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. శ్రీవర్షది ముమ్మాటికి ప్రభుత్వ హత్య అన్నారు. అనంతరం రాంపూర్ గ్రామానికి వెళ్లి బాలిక కుటుంబ సభ్యులకు రూ.50వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

పత్తి కూలీలపై తేనెటీగల దాడి

- 17 మందికి తీవ్ర గాయాలు


బాధితులను పరామర్శిస్తున్న మార్కెట్ చైర్మన్ ఎల్లయ్య

కోనరావుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన 17 మంది పత్తి కూలీలపై తేనెటీగలు ఒకే సారి దాడి చేయడంతో తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ ఘటన కనగర్తి, సుద్దాల గ్రామాల మధ్య జరిగింది. వివరాల్లోకి వెళితే.. వెంకట్రావుపేట గ్రామానికి చెందిన 17 మంది కూలీలు ఉదయం పత్తి చేనులో పని చేస్తుండగా, సమీపంలోని తేనెపట్టు నుంచి ఒక్కసారిగా తేనెటీగలు వారిపై దాడి చేశాయి. దీంతో కూలీలు భయంతో పరుగులు తీశారు. దాడిలో పలువురు కూలీలు స్పృహ కోల్పోయారు. కూలీల ఆర్తనాదాలు విన్న స్థానికులు, చుట్టుపక్కల పొలాల్లో ఉన్న రైతులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వారి సహాయంతో గాయపడిన కూలీలను చికిత్స నిమిత్తం వేములవాడ, సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తేనెటీగల దాడిలో గాయపడ్డ వారు లావణ్య, సుమలత, దేవేంద్ర, కర్ణ, మమత, లత, తేజ, శృతి, రజితతో పాటు మరో 8 మంది కూలీలు ఉన్నారు. తేనెటీగల దాడిలో గాయపడ్డ వారిని కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, ప్రజాప్రతినిధులు మంతెన సంతోష్, కచ్చకాయల బాల్‌రెడ్డి, నాలుక సత్యం, ఎరవెల్లి విజయ్, మల్లారెడ్డి, సంజీవ్, రవి, ఉప్పుల గంగయ్య, బుర్ర రమేష్, బొడ్డు రమేష్, సుంకరి రెడ్డి తదితరులు ఉన్నారు.

పొరండ్లలో జన్మించిన వింత గొర్రె పిల్ల

తిమ్మాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొరండ్ల గ్రామంలోని తోడెంగ బాలయ్య అనే గొర్రెల కాపరికి చెందిన గొర్రె శుక్రవారం వింత గొర్రెపిల్లను జన్మనిచ్చింది. గొర్రె పిల్లకు 3తలలు, 3కండ్లు, 8కాళ్లు ఉన్నాయి. అయితే గొర్రె ఈనే సరికే గొర్రెపిల్ల మృతిచెంది ఉంది.

ఇసుకను తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

కథలాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబారిపేట శివారు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను రెవెన్యూ, పోలీస్ అధికారులు సంయుక్తంగా దాడులుచేసి శుక్రవారం పట్టుకున్నారు. ఇసుకను లోడ్‌చేసుకుని వెళ్తున్న సమయంలో గ్రామస్థులు కొందరు గమనించి డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో అధికారులు అక్కడికి చేరుకుని వాహనాన్ని పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసునమోదు చేసినట్టు అధికారులు తెలిపారు.

బాలికపై అత్యాచారం కేసులో.. 20 సంవత్సరాల జైలు

జగిత్యాల అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మానసిక వ్యాధిగ్రస్థురాలైన బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష, ఐదు వేల రూపాయల జరిమానాతో పాటు బాలికకు నాలుగు లక్షల రూపాయల పరిహారం చెల్లించాలని డిస్ట్రిక్ట్ సెషన్ జడ్జి (ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు ఫర్ పోక్సో కేసెస్) రత్నపద్మావతి శుక్రవారం తీర్పు వెలువరించారు. కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన బాలికను నిందితుడు ఠాకూర్ అరవింద్ సింగ్ (22) అనే వ్యక్తి అత్యాచారం చేశాడు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి కోరుట్ల సీఐ రాజశేఖర్ రాజు, ఎస్సై సురేందర్ రెడ్డి కేసు విచారణ జరిపి ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టుకు ఆదారాలు సమర్పించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు డ్యూటీ అధికారులు సాక్షులను ప్రవేశపెట్టారు. విచారించిన న్యాయమూర్తి నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఐదు వేల రూపాయల జరిమానా విధించినట్లు ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.

గంజాయి నిందితులకు.. ఏడు సంవత్సరాల జైలు

జగిత్యాల అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గంజాయిని అక్రమంగా పండించి అమ్మకానికి యత్నించిన ఇద్దరు నిందితులకు ఏడు సంవత్సరాల జైలు శిక్ష, 20వేల రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా ఫస్ట్‌క్లాస్ అడిషనల్ జడ్జి నారాయణ శుక్రవారం తీర్పు వెలువరించారు. 2021 అక్టోబరు 25వతేదీన మండలంలోని వర్షకొండ సమీపంలో ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని గిడ్డె వినోద్, జాదవ్ రంజిత్ గంజాయి కలిగి ఉన్నారని పోలీసులకు సమాచారం అందింది. అప్పటి ఎస్సై రాజాప్రమీల అక్కడ తనిఖీ నిర్వహించగా అనుమానితులవద్ద నుంచి 2,200గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఓ కారు, ఐదువేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు గంజాయిని అక్రమంగా పండించి అమ్మకానికి ప్రయత్నించినట్లు తేలింది. నిందితులను పోలీసులు పట్టుకుని సాక్ష్యాలు ప్రవేశపెట్టగా జడ్జి శిక్షను ఖరారు చేస్తు తీర్పు వెలువరించినట్లు ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.

విప్‌పై అనుచిత పోస్టులు పెట్టిన వ్యక్తిపై ఫిర్యాదు

కథలాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్‌పై ఫేస్‌బుక్‌లో రుద్రంగికి చెందిన గంటె ప్రసాంత్‌యాదవ్ అనేవ్యక్తి అనుచిత పోస్టులు పెట్టాడని కాంగ్రెస్ నాయకులు స్థానిక ఎస్సై నవీన్‌కుమార్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. అవమానకర పోస్టులు పెట్టి విప్ ఆత్మగౌరవానికి భంగం కలిగించాడని అతనిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం కోరారు. ఈ సందర్భంగా లింగారావు, రంజిత్, రాములు ఉన్నారు.

నేలమట్టమైన రాజన్న లడ్డూ తయారీ కేంద్రం



లడ్డూ తయారీ కేంద్రం తొలగింపు అనంతరం రాజన్న ఆలయం వెనకభాగం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలోని పురాతన లడ్డూల గోదాం నేలమట్టమైంది. ఆలయ ప్రాకారానికి ఆనుకుని ఉన్న లడ్డూ గోదాం కూల్చివేయడంతో బాలాత్రిపురసుందరీదేవి ఆలయంతో పాటు సోమేశ్వర ఆలయాలు బయటకు కనిపిస్తున్నాయి. ఆలయ అభివృద్ధి పనుల కూల్చివేతలు గురువారం రాత్రి ప్రాకారం గోడలోకి ప్రవేశించాయి. ప్రాకారం లోపల భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్‌లు, ఆలయానికి దక్షిణవైపు ఉన్న కోటిలింగాల నుంచి ఏర్పాటు చేసిన క్యూలైన్ల తొలగింపు పనులు చకచకా జరుగుతున్నాయి.

16మంది పిల్లలకు ఓపెన్ హార్ట్ సర్జరీ

సుభాష్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ హార్ట్ సర్జరీ కోసం 15మంది చిన్నపిల్లలకు ఎంపిక చేసినట్లు జిల్లా ఇమ్యూనైజన్ (డీఐవో) అధికారి డాక్టర్ సాజిద తెలిపారు. రెండు రోజులపాటు జిల్లా జనరల్ ఆస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో 0 నుంచి 18 సంవత్సరాలలోపు పిల్లలకు ఉచిత గుండె సంబంధిత వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. హైదరాబాద్ అపోలో ఆసుపత్రి సౌజన్యంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి 153 మంది పిల్లలు వివరాలను నమోదు చేసుకున్నట్లు, వారికి పరీక్షలు నిర్వహించి 28మందికి చికిత్స అవసరమని గుర్తించినట్లు పేర్కొన్నారు. వారిలో 16 మందికి ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరమున్నట్లు, 14మందికి రివ్యూ నిర్వహించనున్నట్లు డీఐవో తెలిపారు.



పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు

సైనిక్ స్కూల్ పిలుస్తోంది

- 2026-27కు ఎంపిక
- ఈనెల 30లోపు దరఖాస్తులకు అవకాశం



చొప్పదండి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రక్షణ రంగాల్లో పని చేయాలనుకునే వారిని సిద్ధం చేసేందుకు భారత రక్షణ శాఖ ఆధ్వర్యంలో సైనిక్‌స్కూల్స్ నడుస్తున్నాయి. ఇవి పిల్లల ఉజ్వల భవిష్యత్‌తో పాటు దేశ సేవ చేసే అవకాశం కల్పిస్తున్నాయి. సైనిక స్కూల్స్ దేశంలోని 33 సైనిక్ స్కూల్‌లో 2026-27 విద్యా సంవత్సరంలో చేరేందుకు విద్యార్థులను ఆహ్వానిస్తుంది. సైనిక స్కూల్స్ సొసైటీ ఆలిండియా సైనిక స్కూల్స్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ (ఏఐఎస్ఎస్ ఈఈ) ఆధ్వర్యంలో 6, 9వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష షెడ్యూల్ విడుదలైంది. రాత పరీక్ష, మెడికల్ ఫిట్‌నెస్ ఫిజికల్ వెరిఫికేషన్ మెరిట్ లిస్టు ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. అక్టోబర్ 30లోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విజయనగరంలోని కోరుకొండ, చిత్తూరులోని కలికిరిలో సైనిక్‌స్కూల్స్ ఉన్నాయి.

పరీక్ష వివరాలు

- 6వ తరగతిలో ప్రవేశం కోసం విద్యార్థులు 01-04-2014, 31-03-2016 మధ్యలో జన్మించి ఉండాలి. 9వ తరగతి పరీక్షకు 01-04-2011 నుంచి 31-03-2013 మధ్య జన్మించి ఉండాలి.
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే చివరి తేదీ అక్టోబర్ 30. దరఖాస్తులను సరిదిద్దే అవకాశం నవంబర్ 2 నుంచి 4 వరకు అవకాశం కల్పించారు. జనవరిలో ప్రవేశ పరీక్ష జరుగుతుంది.
- పరీక్ష మొత్తం ఓఎంఆర్ పద్ధతిలో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు 125 ఉంటాయి. 6వ తరగతిలో 300 మార్కుల పేపరు ఉంటుంది. 9వ తరగతి విద్యార్థులకు 400 మార్కుల పేపర్ ఉంటుంది.
- విద్యార్థులు ఒకేసారి మాత్రమే దరఖాస్తు చేయాలి. దరఖాస్తు అప్‌లోడ్ చేసిన తర్వాత ఎలాంటి మార్పులు చేయరాదు.
- దరఖాస్తులను హెచ్‌టీటీపీఎస్// ఎగ్జామ్స్.ఎన్‌టీఏ.ఎన్ఐసీ.ఇన్/సైనిక్ స్కూల్స్ సొసైటీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి.
- తెలంగాణ రాష్ట్ర విద్యార్థులు ఆంధ్రప్రదేశ్‌లోని రెండు సైనిక్ స్కూల్స్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.



- ప్రవేశ పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీలకు 700 రూపాయలు, జనరల్, ఓబీసీ, డిఫెన్స్, ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు 850 రూపాయలు.
- ప్రవేశ పరీక్ష 13 ప్రాంతీయ భాషల్లో ఉంటుంది. ఎన్‌టీఏ ఆధ్వర్యంలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.
- ప్రవేశ పరీక్ష జనవరిలో జరుగనుండగా, పరీక్ష తర్వాత నాలుగు నుంచి ఆరు వారాల్లో ఫలితాలను ప్రకటిస్తారు.
- తాజా సమాచారం కోసం విద్యార్థుల తల్లితండ్రులు ఎన్‌టీఏ వెబ్‌సైట్‌ను తరచు గమనించాలి.
- ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లయితే విద్యార్థులు ఎన్‌టీఏ హెల్ప్ డెస్క్ నంబర్ 011-040759000 లేదా ఏఐఎస్ఎస్ఇఇ.ఎన్‌టీఏ.ఏసీ.ఇన్‌కు మెయిల్ ద్వారా సంప్రదించాలి.

అర్బన్ ఎన్నికల్లో 59 నామినేషన్లు ఓకే

- 14 తిరస్కరణ
- నేడు ఉపసంహరణ, తుది జాబితా, గుర్తుల కేటాయింపు

కరీంనగర్‌టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు 12డైరెక్టర్ పదవులకు 73మంది నామినేషన్లు వేయగా వాటిని పరిశీలించిన అధికారులు 14 తిరస్కరించారు. 59నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ఎన్నికల అధికారి, జగిత్యాల డీసీవో సీహెచ్. మనోజ్‌కుమార్ ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్ ఒకస్థానానికి 9మంది, మహిళా కేటగిరీలో ఏడుగురు, జనరల్ కేటగిరీలో 43 మంది నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ధ్రువీకరించారు. శనివారం సాయంత్రం 5 గంటలకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియనుంది. ఆ తర్వాత తుది జాబితాను విడుదల చేయడంతోపాటు పోటీలోఉన్న అభ్యర్థులకు గుర్తులను కూడా కేటాయించనున్నారు.

మళ్లీ తెరుచుకున్న శ్రీరాంసాగర్ వరద గేట్లు

జగిత్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద పెరగడంతో శుక్రవారం గేట్లు మరోమారు తెరుచుకున్నాయి. ఎగువప్రాంతం నుంచి 22,154 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. నాలుగు వరద గేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి 12,500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పెద్దింటికి జీవన సాఫల్య పురస్కారం



పెద్దింటి అశోక్‌కుమార్

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సినీ రచయిత పెద్దింటి అశోక్‌కుమార్‌కు జీవన సాఫల్య పురస్కారం లభించింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన సాహితీవేత్త అమృతలత ఏటా తెలంగాణ, రాయలసీమ, ఆంధ్ర ప్రాంతాలకు చెందిన సాహితీ వేత్తలకు జీవన సాఫల్య పురస్కారాలు, అపురూప పురస్కారాలను అందిస్తున్నారు. జీవన సాఫల్య పురస్కారం-2025 సంవత్సరానికి రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన సినీరచయిత పెద్దింటి అశోక్ కుమార్‌ను ఎంపిక చేసినట్లు శుక్రవారం ప్రకటించారు. నవంబరు 2న నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జీవన సాఫల్య పురస్కారం గ్రహీతలకు రూ.25 వేలు నగదు, ప్రశంసాపత్రాలు, మెమెంటోలను అందజేసి సన్మానిస్తారు. రాజన్నసిరిసిల్లజిల్లా కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న పెద్దింటి అశోక్‌కుమార్‌కు జీవనసాఫల్య పురస్కారం రావడంపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

రాజన్న ఖజానాకు రూ.2.19కోట్ల ఆదాయం

- బంగారం 124.50 గ్రాములు, వెండి 10.5 కిలోలు



ఆలయ హుండీల డబ్బులను లెక్కిస్తున్న సిబ్బంది

వేములవాడ కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2,19,35,165నగదు, 124గ్రాముల 500 మిల్లీల మిశ్రమ బంగారం, 10కిలోల 500 గ్రాముల వెండి సమకూరినట్లు ఆలయ ఈవో రమాదేవి వెల్లడించారు. శ్రీరాజరాజేశ్వరస్వామి వారి గత36రోజుల హుండీలను ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో అత్యంత భద్రత మధ్య శుక్రవారం ఉద్యోగులు, సిబ్బంది లెక్కించారు. ఈవో రమాదేవి పర్యవేక్షించగా ఏసీ కార్యాలయ పరిశీలకులు రాజమౌళి, ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు ఉద్యోగులు శ్రీరాజరాజేశ్వర సేవాసమితి సభ్యులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

కాల్ చేయండి.. సమస్యను పరిష్కరించుకోండి

- విద్యుత్ సమస్యలకు 1912తో చెక్
- టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రమేష్‌బాబు



మేక రమేష్‌బాబు, టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ

గణేశ్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మీ పరిధిలో కరెంట్ పోయిందా? మీ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందా? అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదా? పొలాల్లో వదులు తీగలున్నా అధికారులు సరిచేయ డంలేదా? ఇలా సమస్య ఏదైనా సరే 1912కు కాల్‌చేస్తే వెంటనే సమస్య పరిష్కారం అవుతుందంటున్నారు టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రమేష్‌బాబు. 1912 నంబరుకు కాల్ చేస్తే మీటరు నంబరు, ఊరు, పేరు నమోదు చేసుకొని ఒక ఐడీ నంబరు ఇస్తారు. సమస్య పరిష్కారమయ్యే వరకు కాల్‌సెంటర్ సిబ్బంది మీమొబైల్‌లో అందుబాటులో ఉంటారు. ఒకవేళ సమస్యపరిష్కారం కాకపోతే దానికి గల కారణాన్ని వివరిస్తారు.

యాప్ ద్వారా సైతం ఫిర్యాదు

టీజీ ఎన్‌పీడీసీఎల్ సాంకేతికత పెంచడంతో పాటు వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. టీజీ ఎన్‌పీడీసీఎల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశముండగా నిరక్షరాస్యులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సులువుగా గుర్తు ఉండేలా 1912 నంబరును ట్రాన్స్‌ఫార్మర్‌ల మీద ముద్రిస్తున్నారు. ఫిర్యాదు చేయగానే మొబైల్‌కు ఫిర్యాదు నంబరు వస్తుంది. ఆ నంబరు ఆధారంగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపుతారు. పరిష్కారం ఆలస్యమైతే ఫోన్ చేసి పరిష్కారం ఏ దశలో ఉందో చెబుతారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రమేష్‌బాబు తెలిపారు.

కొనసాగుతున్న గోదావరి హారతి



ధర్మపురి వద్ద గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురివద్ద గోదావరి హారతి మూడోరోజు శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం ప్రారంభంనుంచి జరిగే కార్యక్రమంలో భాగంగా ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, మహిళలు మంగళ వాయిద్యాలు వెంటరాగా గోదావరినది వరకు శోభా యాత్ర నిర్వహించారు. అనంతరంఆలయ వేదపండితులు బొజ్జరమేష్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు దేశం సుభిక్షంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ పూజలు జరిపారు. రాత్రి నదీమాతకు హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు దొప్పల్లో దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలమండలి చైర్మన్ జక్కురవీందర్, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ధర్మకర్త గణేష్ పాల్గొన్నారు.

ముగిసిన ఉమ్మడి జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు



ట్రోఫీ అందుకుంటున్న కరీంనగర్ జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు శుక్రవారం ముగిశాయి. జిల్లా కేంద్రంలోని కేహెచ్ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీలకు విశేష స్పందన లభించింది. పోటీల్లో అండర్-14 విభాగంలో కరీంనగర్ జిల్లా, అండర్-17 విభాగంలో పెద్దపల్లి జిల్లా జట్లు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సాధించాయి. జట్లకు రాఘవేంద్ర హాస్పిటల్ అధినేత డాక్టర్ శరత్ కుమార్ రెడ్డి ట్రోఫీలను పతకాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి బాషబోయిన వేణుగోపాల్, కేహెచ్ఆర్ స్పోర్ట్స్ అకాడమీ డైరెక్టర్ గౌతమ్‌రెడ్డి, సురేందర్‌సింగ్, వ్యాయామ ఉపధ్యాయులు కట్ట సంతోష్, సీహెచ్ శ్రీనివాస్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

యాదవులు రాజకీయంగా ఎదగాలి

- యాదవ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొమురయ్య యాదవ్



ఖాదర్‌గూడెంలో జరిగిన యాదవ రాజకీయ శిక్షణలో అభివాదం చేస్తున్న యాదవులు

మానకొండూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): యాదవులు రాజకీయంగా ఎదగాలని యాదవ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సొగాని కొమురయ్య యాదవ్ పిలుపునిచ్చారు. మండలంలోని ఖాదర్‌గూడెం గ్రామ శివారులో ఉమ్మడిజిల్లా యాదవ రాజకీయ శిక్షణ సదస్సు శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యాదవులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీపడి రాజకీయంగా పేద ప్రజలకు సేవ చేయాలన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని యాదవులను సంఘటిత పరిచి రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తామన్నారు. రాజకీయ పార్టీలు యాదవులను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయే తప్పా వారిని అభివృద్ధి చేయడం లేదన్నారు. ఇప్పటికైనా యాదవులు మేల్కొని రాజకీయాలలో ప్రవేశించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల అధ్యక్షులు నాగారపు సత్యనారాయణ, బల్కం మల్లేశ్ యాదవ్, రాజేందర్ యాదవ్, జాతీయ కౌన్సిల్ సభ్యులు బూస అంజన్న యాదవ్, రవీందర్ యాదవ్, మల్లేశ్ యాదవ్, కనబోయిన ఓదెలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కళతప్పిన పల్లె ప్రకృతివనం

మల్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పల్లె ప్రకృతివనాలపై అధికారుల పట్టింపు కరువైంది. గ్రామాల్లోని ప్రకృతివనాలు దట్టమైన చెట్లు, పిచ్చిమొక్కలతో కళాహీనంగా మారాయి. ఆహ్లాదం పంచేందుకు ఏర్పాటు చేసిన ప్రకృతివనంలోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మల్యాల బ్లాక్‌చౌరస్తా సమీపంలో గల ప్రకృతివనం మందుబాబులకు అడ్డాగామారింది. క్రీడాపరికరాలు పిచ్చిమొక్కలలో కనిపించకుండా అధ్వానంగా మారింది.



మల్యాలలో అధ్వానంగా మారిన ప్రకృతివనం

దిగువ కొండగట్టులో వెలగని హైమాస్టు లైట్లు

- చీకట్లో ఇబ్బందులు పడుతున్న భక్తులు, స్థానికులు

మల్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని దిగువ కొండగట్టులో హైమాస్టు లైట్లు వెలగడం లేదు. పది రోజులుగా లైట్లు వెలగకపోవడంతో చిమ్మ చీకట్లు అలుముకున్నాయి. దీంతో అంజన్న దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు తీవ్రఅసౌకర్యంగా మారుతోంది. బస్సులు, ద్విచక్రవాహనాలు, కార్లు, తదితర వాహనాల్లో వేలాదిగా భక్తులు ఘాట్‌రోడ్డు మీదుగా కొండపైకి వెళ్లడానికి దిగువకొండగట్టులోని స్టేజీనుంచి వెలుతుంటారు. అయితే చీకటిపడగానే ఈమార్గం కనిపించకపోవడంతో వాహనదారులు, నడిచివెళ్లే వారు అయోమయానికి గురి అవుతున్నారు. అలాగే స్వామివారి దర్శనం చేసుకొని కొండదిగి వచ్చే భక్తులు దిగువ కొండగట్టులో ఆటవస్తువులు, తీర్థయాత్ర సామగ్రి కొనుక్కోవడం పరిపాటి. కాగా లైట్లు లేక అసౌకర్యానికి గురి అవుతున్నారు. దిగువ కొండగట్టులో నివసించే జనాలు కూడా లైట్లు వెలుగకపోవడంతో చీకట్లతో ఆందోళన చెందుతున్నారు. హైమాస్టు లైట్లకు మరమ్మతులు చేయాలని, కొండ పైవరకు పూర్తి స్థాయిలో లైట్ల వెలుతురు ఉండేలా దేవస్థానం అధికారులు తగుచర్యలు తీసుకోవాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.



హైమాస్టు లైట్లు వెలగక చీకటిమయంగా ఉన్న దిగువ కొండగట్టు ప్రాంతం

మహిళలకు వివిధ కోర్సులలో ఉచిత శిక్షణ

తిమ్మాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల దుర్గాబాయి మహిళా శిశువికాస కేంద్రంలో 18నుంచి 45సంవత్సరాలలోపు మహిళలకు స్వయం ఉపాధికై వివిధ కోర్సులకు ఉచిత శిక్షణను నవంబర్ 10నుంచి ప్రారంభించనున్నట్లు దుర్గాబాయి మహిళా శిశువికాస కేంద్ర జిల్లా మేనేజరు సుధారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచితంగా అందించే కోర్సులు టైలరింగ్, జూట్‌బ్యాగ్ తయారీ, ఈ-ఆటో డ్రైవింగ్, ప్రీప్రైమరీ టీచర్‌ట్రైనింగ్ వంటి కోర్సులలో శిక్షణ పొందేందుకు 25మంది మహిళలకు రెండు నెలల పాటు శిక్షణ, ఉచితహాస్టల్ వసతిఅవకాశం కల్పించనున్నారు. ఆసక్తిగల మహిళలు తమ 7నుంచి 10వ తరగతి ఉత్తీర్ణత ధృవపత్రాలను, ఆధార్‌జిరాక్స్, రెండు ఫొటోలతో నవంబర్ 7లోపు ఎల్ఎండీ కాలనీలోని తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మహిళాప్రాంగణ మేనేజర్ తెలిపారు.

భక్తజన సంద్రంగా రాజన్న క్షేత్రం

- భీమన్న ఆలయంలో కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు
- రాజన్న ఆలయంలో కార్తీకదీపాలు వెలిగించి మొక్కులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి, భీమేశ్వర ఆలయాలు శుక్రవారం భక్తజనసంద్రంగా మారాయి.



రాజన్న ఆలయం ముందు కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా భీమేశ్వర ఆలయంలో ఆర్జిత సేవలను ఏర్పాటు చేయడంతో భక్తులు భీమన్న దర్శనానికి పోటెత్తారు. ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు రాజన్న ఆలయంలోని ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించారు. రాజన్నను దర్శించుకుని ఆలయం ముందు కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రాజన్నకు కోడె మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు భీమన్న ఆలయానికి చేరుకున్నారు. దీంతో రాజన్న ఆలయం శుక్రవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులు భీమేశ్వర స్వామిని దర్శించుని కోడె మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో రమాదేవి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



భీమన్న ఆలయంలో కోడెమొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

● న్యూస్‌బాక్స్

నేడు ఆయుర్వేద వైద్య శిబిరం

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి):వికాసతరంగిణి-01 శాఖ ఆధ్వర్యంలో జ్యోతీనగర్ మహాలక్ష్మీ గోదాదేవీ సమేత వేంకటేశ్వరాలయంలో శనివారం ఉదయం 7 గంటల నుంచి భావ ఆయుర్వేద కేంద్రం వారు ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ కన్సల్టేషన్ ఉచితమని, అన్ని వ్యాధులకు మందులు లభిస్తాయని పేర్కొన్నారు.

బీసీలకు రక్షణ చట్టాలు కల్పించాలి

జమ్మికుంట రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలకు ఏ విధంగానైతే రక్షణ చట్టాలు ఉన్నాయో అదే విధంగా బీసీలకు కూడా రక్షణ చట్టాలు కల్పించాలని బీసీ ముస్లిం (ఏబీఈ) తెలంగాణ రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్ డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 42శాతం రిజర్వేషన్ల సాధనకై బీసీ రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చాలనే డిమాండ్‌తో నిర్వహించిన మహా ధర్నాలో ఆయన పాల్గొన్నారు.

డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ

చొప్పదండి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నషాముక్త్ భారత్ అభియాన్ అంశంపై నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో చొప్ప దండి జడ్పీస్కూల్ 9వతరగతి విద్యార్థి బి అక్షయ్ ద్వితీయ స్థానంతో వెండి పతకాన్ని సాధించాడు. పతకాన్ని సాధించిన విద్యార్థిని, డ్రాయింగ్‌మాస్టర్‌ను ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు జలీల్ అభినందించారు.

భాగవత సప్తాహం ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మానేరు డ్యాం రోడ్ ఉజ్వలపార్క్ సమీపంలోని రాధాగోవింద నిలయం ఇస్కాన్ మందిరంలో కార్తీక మాసం సందర్భంగా శుక్రవారం ప్రభు నరహరిదాస్ నేతృత్వంలో భాగవత సప్తాహం ప్రారంభమైంది. తొలి రోజు భాగవతం విశిష్ఠత, శ్రీకృష్ణుని అవతార ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎల్.రాజభాస్కర్‌రెడ్డి, డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, తుమ్మల రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపూర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం హుజూరాబాద్ పీఏసీఎస్ చైర్మన్ కొండాల్‌రెడ్డి ప్రారంభించారు. మండలంలోని పోతిరెడ్డిపేటలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ఎంపీడీవో సునీత ప్రారంభించారు. ఉపాధ్యక్షులు ముద్రబోయిన శంకర్, పాలకవర్గ సభ్యులు గూడురి ప్రభాకర్‌రెడ్డి, బొడ్డు అనసూర్య దండ భాస్కర్‌రెడ్డి, యాళ్ల సుజాత, గోస్కుల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ కొండాల్‌రెడ్డి

మానకొండూర్: వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మానకొండూర్ ఏఎంసీ చైర్మన్ మర్రి ఓదెలు రైతులను కోరారు. మండలంలోని లింగాపూర్, వేగురుపల్లి, తదితర గ్రామాల్లో శుక్రవారం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో నందగిరి రవీంద్రాచారి, మాజీ ఎంపీటీసీ పొల్సాని పితాంబర్‌రావు, ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని తహసీల్దార్ రాజమల్లు అన్నారు. శుక్రవారం మండలం లోని గడ్డివానిపల్లెలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగరాజు, ఏపీవో స్వామి, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీణవంక :మండలంలోని కనపర్తి, బ్రాహ్మణపల్లి, ఇప్పలపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం తహసీల్దార్ అనుపమరావు, ఎంపీడీవో శ్రీధర్ ప్రారంభించారు. ఏపీఎం సుధాకర్, ఎంఎస్‌సీసీ పద్మ, సీసీలు ఆనంద్, తిరుపతి, శ్యామ్, వీవోఏలు, రైతులు, సెంటర్ ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలు



మాట్లాడుతున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలను నిర్వహించనున్నట్లు అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోటీల సన్నాహక సమావేశంలో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని శాతవాహన యూనివర్సిటీ ప్రాంగణంలో బాలబాలికలకు ఉదయం 6:30 గంటల నుంచి సైక్లింగ్ పోటీలు ఉంటాయని తెలిపారు. అండర్- 14, అండర్-17, అండర్-19, అండర్-21, 21 సంవత్సరాల పైబడిన వారికి పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. పోటీల్లో ఉత్తమ ప్రదర్శన చాటిన క్రీడాకారులను నవంబరు 1, 2 తేదీల్లో యాదాద్రి భువనగిరిలో జరగనున్న రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపిక చేయనున్నామన్నారు. పాల్గొనేవారు వయసు ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ బి.మధుసూదన్ రెడ్డి, వేణుగోపాల్, సంఘం ప్రతినిధులు ఇ.రమేష్, జగదీశ్వరాచారి పాల్గొన్నారు.

ఇంటర్ ఫీజులను ప్రభుత్వమే నిర్ణయించాలి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఇంటర్మీడియెట్ ఫీజులను ప్రభుత్వమే నిర్ణయించాలని, ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్ ప్రక్రియ చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్‌రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియెట్ ఫీజులను ప్రభుత్వమే నిర్ణయిస్తోందని, డిగ్రీ దోస్త్ తరహాలో ప్రవేశాలు చేపడుతోందని అన్నారు. దీంతో విద్యార్థులకు మేలుజరుగుతుందని, తల్లిదండ్రులపై కొంతైన ఆర్థికభారం తగ్గుతుందని అన్నారు. డిగ్రీ, ఇంజనీరింగ్, వృత్తి విద్యాకోర్సుల ఫీజులను నిర్ణయిస్తున్న ప్రభుత్వం ఇంటర్ ఫీజులను యాజమాన్యాలకు వదిలిపెట్టడంతో లక్షలాది రూపాయల ఫీజులను దర్జాగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ల ప్రక్రియను ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు ఇప్పుడే ప్రారంభించారని, బోర్డు ఆఫ్ ఇంటర్మీడియెట్ అధికారులు ఏమీ పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇంటర్మీడియట్ కోర్సుల ఫీజులను నియంత్రిం చేందుకు ప్రభుత్వమే ఫీజు నిర్ణయించాలని, దోస్త్ తరహా అడ్మిషన్లను చేపట్టి, కార్పొరేట్ కళాశాలల దోపిడీని అరికట్టాలని కోరారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ట్రాక్టర్ కొనుగోలుపై ఆదా

చొప్పదండి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ట్రాక్టర్ కొనుగోలుపై లక్షరూపాయల వరకు ఆదా అవుతోందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. బీజేపీ నిర్వహిస్తున్న జీఎస్టీ సంబరాల మాసోత్సవంలో భాగంగా చొప్పదండి పట్టణంలోని ట్రాక్టర్ షోరూమ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ కొనుగోలు చేస్తున్న రాగంపేటకు చెందిన సింగసాని కనకయ్య ను సత్కరించారు. మండల అధ్యక్షులు మొగిలి మహేష్, జిల్లాకార్యదర్శి చేపూరి సత్యనారాయణ, సింగిరెడ్డి భూమిరెడ్డి, గొల్ల గట్టయ్య పాల్గొన్నారు.

ట్రినిటి ఇంజనీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సు

కరీంనగర్ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు బొమ్మకల్‌లోని ట్రినిటి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎంబీఏ, బీటెక్ విద్యార్థులకు ఎంఎస్‌ఎంఈ, సీటీడీ ఎక్స్‌టెన్షన్, కరీంనగర్ ద్వారా ఎంట్రప్రెనర్షిప్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో కొత్త కంపెనీల ఆలోచనను ప్రోత్సహించడం, ఆవిష్కరణలు, స్టార్టప్ అవకాశాలపై అవగాహన అందించడం, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల కోసం ప్రభుత్వం సహాయ పథకాలపై అవగాహన కల్పించడం వంటి వాటికి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు డిజిటల్ సర్టిఫికేషన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేంద్ర సింగ్, ఏవో రాజశేఖర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పి.కిషోర్, ఎంబీఏ విభాగపు అధిపతి, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, హెచ్‌ఓడీలు బలరాం, శ్రీధర్, సంపత్, రజిత, అధ్యాపకులు డాక్టర్ జి.సంతోషి, డి.రజిత రెడ్డి, మహమ్మద్ ఇలియాస్ అలీ, మహమ్మద్ అజారుద్దీన్ సుప్రియ పాల్గొన్నారు.



కార్యక్రమంలో ఎంబీఏ, బీటెక్ విద్యార్థులు

ఆలయాల్లో కార్తీక పూజలు

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక తొలి శుక్రవారం సందర్భంగా పలు ఆలయా ల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. యజ్ఞవరాహక్షేత్రం, అంబాభవానీ ఆలయం, మహాశక్తి దేవాలయం, హనుమాన్ సంతోషిమాత ఆలయం, కన్యకాపరమేశ్వరి దేవాలయం, హనుమత్ సహిత కనకదుర్గ ఆలయం, పెద్దమ్మతల్లి ఆలయంతో పాటు వివిధ ఆలయాల్లో అమ్మవార్లను భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. ఉదయం, రాత్రి దీపారాధనలు, దీప దానాలు చేశారు.

ఎస్సారార్‌లో ఫ్రెషర్స్ డే

గణేశ్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల స్వయం ప్రతిపత్తి కరీంనగర్ లైఫ్ సైన్సెస్ విభాగం, జీవశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం జెనెసిస్ గాల 2025 పేరిట ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపక సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ ఫ్రెషర్స్‌డే విద్యార్థుల పరిచయాలతోపాటు భవిష్యత్ ప్రణాళికలకు తోడ్పడుతుందన్నారు.



ఫ్రెషర్స్ డేలో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

నేడు నాగుల చవితి

కరీంనగర్‌కల్చరల్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): కార్తీక శుక్ల చతుర్థి నాగులు ఆవిర్భవించిన నాగుల చవితిని శనివారం జరుపుకోనున్నారు. ఉపవాసాలు పాటిస్తూ పుట్టల్లో పాలు పోయనున్నారు. సర్పసూక్తం, అనంత నాగేంద్ర, సుబ్రహ్మణ్యేశ్వర స్తుతులతో అభిషేక, అర్చనాదులు చేసి, పుట్టమట్టిని బంగారంగా భావించి తిలకధారణ చేసుకోనున్నారు. పుట్టలు, సుబ్రహ్మణ్య, అనంత నాగేంద్రస్వామి, నాగుల విగ్రహాలు గల ఆలయాల్లో నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

‘అమృతలత’ జీవన సాఫల్య పురస్కారానికి ‘నలిమెల’ ఎంపిక

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన సాహితీ వేత్త, కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార విజేత, బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్ ‘అమృతలత’ జీవన సాఫల్య పుర స్కారానికి ఎంపికయ్యారు. నాలుగు దశాబ్దా లుగా అనువాద రంగంలో చేస్తున్న కృషికి నవంబరు 2న నిజామాబాద్, మామిడిపల్లిలోని శ్రీవారి అపురూప కల్యాణమండపంలో పుర స్కారం అందుకోనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ కాళోజి అవార్డు గ్రహీత నెల్లుట్ల రమాదేవి అధ్యక్షతన ముఖ్య అతిథి కేంద్ర సాహిత్య అకాడమి తెలుగు సలహామండలి కన్వీనర్ డాక్టర్ సిమ్మృణాళిని, మరో అతిథి ప్రతిమ, పురస్కార ప్రదాత డాక్టర్ అమృతలత పురస్కారం అందజేయనున్నారు. భాస్కర్ పురస్కారానికి ఎంపికవడంపై అన్నవరం దేవేందర్, నగునూరి శేఖర్, గాజోజు నాగభూషణం, కూకట్ల తిరుపతి, బూర్ల వెంకటేశ్వర్లు, తోట నిర్మలారాణి, కందుకూరి అంజయ్య తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

సీపీని కలిసిన ట్రైనీ డిప్యూటీ కలెక్టర్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన పాలకుర్తి సందీప్ శుక్రవారం పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంను కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సందీప్ ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్‌గా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా సీపీకి పుష్పగుచ్ఛం అందజేసి ఆశీస్సులు తీసుకున్నారు. సందీప్ వెంట ఆయన తండ్రి, రిటైర్డ్ ఏసీపీ పాలకుర్తి కాశయ్య ఉన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం

జమ్మికుంట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న-సదానందం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇద్దరు రైతులు 26.50 క్వింటాళ్ల పత్తి విక్రయానికి తీసుకురాగా సీసీఐ ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేపట్టింది. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ రైతులు దళారులకు పత్తిని విక్రయించి మోసపోవద్దన్నారు. ప్రభుత్వరంగ సంస్థ సీసీఐకి విక్రయించుకొని మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల గ్రామంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో, బాలుర-2లో 2025-26 విద్యాసంవత్సరానికి మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కనపర్తి సురేష్ శుక్రవారం తెలిపారు. 6,7,8,9 తరగతులలో సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన అభ్యర్థులు ఈనెల 27వ తేదీన సంప్రదించాలని పేర్కొన్నారు.

యాస్వాడలో శివాలయానికి గ్రామస్థుల భూమిపూజ

గన్నేరువరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాస్వాడలో గ్రామస్థులంతా కలిసి హనుమాన్ ఆలయ ఆవరణలో శివాలయం నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆలయానికి భూమిని విరాళంగా అందజేసిన డాక్టర్ దంపతులు శ్రీరాంరెడ్డి-అరుణను గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ మధూకర్, ఉపసర్పంచ్ రఘునాథ్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హుస్సేనీపురాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలు మోసపోయారని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని ఊదరగొట్టి ఒక్క ఇల్లు కూడా కట్టించలేదని అన్నారు. ఆనాడైన ఈనాడైనా ఇళ్లు నిర్మించి ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. డివిజన్ బాధ్యులు షబానా మహమ్మద్, సమద్ నవాబ్, హనీఫ్, మీరజ్, మసుమ్, ఖలీల్, బషీర్, జాఫర్, ముల్కలా కవిత, అస్తపురం తిరుమల, ఊరడి లత తదితరులు పాల్గొన్నారు.





భూమిపూజ చేస్తున్న కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, వెలిచాల రాజేందర్‌రావు

● పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

కరీంనగర్ రూరల్: అర్హులైన పేదలందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని ఆ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. శుక్రవారం కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల తర్వాత మళ్లీ ఇంది రమ్మ ఇళ్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ పాలకులు పదేళ్లలో పేదలకు ఒక్క ఇల్లు కూడా కట్టిం చలేదన్నారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

కరీంనగర్ టౌన్/కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని రాంపల్లిలో గోరక్షకుడు సోనూ సింగ్‌పై తుపాకులతో దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి విచారణ జరిపి న్యాయం చేయాలని విశ్వహిందూపరిషత్, గోరక్షా బాధ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డీఓకు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. పోలీసులు సోనూసింగ్ పై తప్పుడు ఆరోపణలు చేయడం దారుణమన్నారు. అక్రమంగా ఆయుధాలు వాడుతున్న రౌడీ మూకలను అదుపులోకి తీసుకోవాలన్నారు. గో అక్రమ రవాణాను అరికట్టాలని కోరారు. గోరక్షా స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఉట్కూరి రాధాకృష్ణారెడ్డి, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి విద్యాసాగర్, రాజేందర్, శ్రీనివాస్, వంశీ, మహిపాల్, బొప్పు శ్రీహరి పాల్గొన్నారు.

యువత చేతుల్లోనే సమాజ మార్పు

సుభాష్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సమాజ మార్పు యువత చేతుల్లోనే ఉందని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు వెన్నపూల బ్రహ్మారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్‌బీఎస్ ఫంక్షన్ హాలులో మహాదేవ ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు ఉరుమల్ల విశ్వం ఆధ్వర్యంలో యువ చైతన్య సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నాయకుల వెంట తిరిగితే నాయకులు కాలేరని, నాయకత్వ లక్షణాలు అవర్చుకుంటేనే మార్పు దిశలో అడుగుపెడతారని అన్నారు. విద్యతోపాటు సమాజానికి సేవ చేయాలనే తపన ఉండాలన్నారు. యువతీ యువకులు విద్యతోపాటు విలువలు, సంస్కారం, ఆత్మవిశ్వాసం కలిగి ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చాకలి ఐలమ్మ మనుమరాలు చిట్యాల శ్వేత, శ్రీరామోజు అంజనాదేవి, పి సుగుణాకర్‌రావు, చాట్ల శ్రీధర్, కొరివి వేణుగోపాల్, అలేఖ్య, కాంత, లక్ష్మి పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ మాధవి

వీణవంక, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని హుజూరాబాద్ ఏసీపీ మాధవి అన్నారు. మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామంలో ఇటీవల మార్నింగ్ వాక్ ఇన్ విలేజ్ ప్రోగ్రాంలో భాగంగా జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ తిరుపతి గ్రామస్థుల సహకారంతో ఏడు కెమెరాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఏసీపీ మాధవి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో నేరాల నియంత్రణకు, దొంగతనాలను అరికట్టేందుకు సీసీ కెమెరాల పాత్ర కీలకంగా పనిచేస్తాయన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన దాతలందరినీ అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ తిరుపతి, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరం మానేరు వంతెనకు నిధులు

(5వ పేజీ తరువాయి)

నలు కూడా చేపట్టారు. కొత్తగా వచ్చిన ప్రతిపాదనలలో గన్నేరువరం శివారులోని ఆది హన్మాన్ ఆలయం నుంచి ఎలగందులను కలుపుతూ మానేరు నదిపై వంతెన నిర్మించాలనేది ఒకటి. ఈ వంతెన నిర్మాణం చేపడితే వంతెన పొడువు 750 నుంచి కిలో మీటరు వరకు ఉంటుంది. దీనితో నిర్మాణ వ్యయం పెరిగే అవకాశమున్నది. అలాగే గన్నేరువరం నుండి మైలారం గ్రామ మైసమ్మ గుట్టమీదుగా పద్మనగర్ వరకు కలిపే వంతెనను నిర్మించాలని కూడా ఆయా గ్రామాల ప్రజలు ప్రతిపాదిస్తున్నారు. ఈ మార్గం ద్వారా 11 కి.మీ. ప్రయాణించి మండల కేంద్రానికి చేరుకోవచ్చు. అయితే బ్రిడ్జి సుమారు 1.50 కి.మీ.కు పైగా మానేరుపై నిర్మించాల్సి ఉంటుంది. దీనితో నిర్మాణ వ్యయం రెట్టింపవుతుందని భావిస్తున్నారు. ఈ మూడు ప్రతిపాదనలు మండలంలోని ఆయా గ్రామాల ప్రజల నుంచి వస్తుండడంతో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ వాటిని పరిశీలించారు. అయితే ఎక్కడ వంతెన నిర్మించాలనే విషయంలో వారు ఒక నిర్ణయానికి రాలేదు, ఇప్పటి వరకు ఆ విషయాన్ని బహిరంగంగా ప్రకటించలేదు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం మొదలు ప్రతిపాదించిన మేరకు నిధులు విడుదల చేయడంతో ఇప్పుడు వంతెన నిర్మాణం ఎక్కడ అన్నది తప్పకుండా తేలాల్సిన అవసరం వచ్చింది. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ అయిన కేంద్రమంత్రి ఏ నిర్ణయం తీసుకుంటారన్న విషయం పట్ల ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

హుజూరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ డిపో నుంచి అరుణాచలానికి కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక బస్సుసేవలు అందిస్తున్నట్లు డిపో మేనేజర్ రవీంద్రనాథ్ శుక్రవారం ప్రకట నలో పేర్కొన్నారు. నవంబరు 3న డిపో నుంచి సూపర్‌లగ్జరీ బస్సు ప్రారంభమై కరీంనగర్, హైదరాబాద్ మీదుగా కాని పాకం, గోల్డెన్ టెంపుల్ తదితర ప్రాంతాల నుంచి 4న అరుణాచలం చేరు కుంటుందన్నారు. గిరి ప్రదర్శన అనంతరం 5న సాయంత్రం తిరిగి ప్రయాణమై 6న ఉదయం ఆలంపూర్ జోగులాంబ అమ్మవారి దర్శనం తర్వాత హుజూరాబాద్ చేరుకుంటుందని తెలిపారు. పెద్దలకు రూ.4600, చిన్నారులకు రూ.3500ధరలు నిర్ణయించి నట్లు తెలిపారు. ముందుగానే టికెట్లు బుకింగ్ చేసుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థులు

భగత్‌నగర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులు జి. సుశాంత్, డి.మహిత్ రెడ్డిని విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకం

భగత్‌నగర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణంలో యువత పాత్ర కీలకమని ప్రముఖ సైకాలజిస్ట్, ఏపీఏ ఇండియా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలిపల్లి నాగేశ్వర్ అన్నారు. శుక్రవారం రేకుర్తిలోని సాన్వి డిఫెన్స్ కళాశాలలో ప్రకృతి-ఐఆర్‌సీఏ రీహాబిలిటేషన్ సెంటర్, అడ్వాన్స్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నషాముక్తి భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు, మాదకద్రవ్యాల వ్యసనంతో బంగారం లాంటి భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. కళాశాల చైర్మన్ ఎర్రంశెట్టి మునీందర్, ప్రముఖ గ్రాఫాలోజిస్ట్ బొల్లంపల్లి సత్యప్రకాశ్, ప్రకృతి ఐఆర్‌సీఏ ఇన్‌చార్జి మారుతి మోహన్‌రావు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న 2009 బ్యాచ్ ఎస్సైలు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పీసీఆర్‌లో విధులు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ ఎం.వరప్రసాద్‌కు 2009 ఎస్సై బ్యాచ్ సంక్షేమ కమిటీ మానవత్వాన్ని చాటుకుంది. కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకొని కోలుకుంటున్న తమ బ్యాచ్ సభ్యుడు ఎం.వరప్రసాద్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 5లక్ష 14 వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్‌ను బ్యాచ్ సభ్యులు స్వయంగా హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అందజేశారు. ఇన్‌స్పెక్టర్లు బగ్గని శ్రీనివాస్ (వరంగల్ రేంజ్), జి.శ్రీనివాస్ వర్మ, ఎ.మధుసూధన్‌రెడ్డి, జి.కె.ప్రసాద్ (హైదరాబాద్ రేంజ్) తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

భగత్‌నగర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని ఎలగందల్ మోడల్ స్కూల్ విద్యార్థి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న టి.అవినాష్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నిర్వహించిన అండర్ -19 వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటాడు. ఈ నెల 25, 26 తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా అవినాష్‌ను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కొడిమ్యాల శ్రీనివాస్, పీడీ హరీష్, ఉపాధ్యాయులు అభినందించారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజల్లో రాజేందర్‌రావు

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కిసాన్ నగర్ పసుల నారాయణ కాలనీలో పంచముఖాంజనేయ, కాశీ విశ్వేశ్వర ఆలయంలో శుక్రవారం కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు పూజలు చేశారు. ఆలయంలో ధ్వజస్తంభ, నవగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, నాయకులు పాల్గొన్నారు.

జాగృతిలో పలువురి చేరిక

కరీంనగర్ టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతిలో జిల్లాకు చెందిన పలువురు తెలంగాణ ఉద్యమకారులు, వివిధ పార్టీల నాయకులు జాగృతి వ్యవస్థాపకురాలు కవిత సమక్షంలో చేరారు. శుక్రవారం జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని జాగృతి కేంద్ర కార్యాలయంలో కవిత జిల్లా నుంచి జాగృతిలో చేరిన వారికి కండువా కప్పి స్వాగతించారు. బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు పెండ్యాల మహేశ్, తిమ్మాపూర్ మండల మల్లాపూర్ మాజీ ఉపసర్పంచ్ బూడిద పర్శరాంగౌడ్, తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు చంటి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు దెబ్బటి సూర్య, పెరుమాండ్ల అభిషేక్, కోంద్ర శోభారాణి, మౌనిక జాగృతిలో చేరారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవం

శంకరపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో డాక్టర్ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ఓ మహిళకు సాధారణ ప్రసవం చేశారు. లింగాపూర్‌కు చెందిన ముద్రకోల గంగ పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. డాక్టర్ సంధ్యారాణి, సిబ్బంది సాధారణ ప్రసవం చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు తెలిపారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన

గణేశ్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలోని సైన్స్‌కళాశాల సెమినార్ హాల్‌లో శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ రమాకాంత్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేడీసీసీ బ్యాంకు మేనేజర్ కె.శారద విద్యార్థులకు సైబర్ నేరాల నివారణ, డిజిటల్ బ్యాం కింగ్ భద్రత, ఆన్‌లైన్ లావాదేవీల్లో జాగ్రత్తలు, సురక్షిత, ఆర్థిక వ్యవహారాల ప్రాధాన్యంపై వివరించారు.

రెండో పీఆర్సీని ప్రకటించాలి

హుజూరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు రెండో పీఆర్సీని వెంటనే ప్రకటించాలని తెలంగాణ వాణిజ్య పన్నులశాఖ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముజాహిద్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం హుజూరా బాద్‌లో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రభుత్వఉద్యోగులు రెండో పీఆర్సీ వెంటనే అమలవు తుందని ఎదురుచూస్తున్నారన్నారు.

వన్నారం జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ

మానకొండూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వన్నారంలో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. గ్రామప్రత్యేక అధికారి కె వెంకన్న, కార్యదర్శి తంబ ప్రసూన, మాజీసర్పంచులు పొలాడి రామారావు, మద్దెల లక్ష్మయ్య పాల్గొన్నారు.